గణపసముద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

రైతులు అధైర్య పడొద్దు

- చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం
- సాగు, తాగు నీటికి ఢోకాలేదు
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

గణపురం, మార్చి 29 : రైతులు అధైర్య పడొద్దని, చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. శుక్రవారం ఆయన గణపసముద్రం చెరువును పరిశీలించారు. అనంతరం రైతులు, ఐబీ, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడారు. సాగు, తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పంటలకు చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గణపసముద్రం నుంచి మిషన్ భగీరథకు నీటిని తరలించడం వల్ల చెరువు ఎండిపోతుందనే భ్రమను రైతులు తీసేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఈఈ వెంకటేశ్వర్లు, ఐబీ డీఈ బస్వప్రసాద్‌గౌడ్, ఏఈలు మహేందర్, సమ్మారావు, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీటీసీ మోటాపోతుల శివ శంకర్‌గౌడ్, రైతులు ఎస్ బాబూరావు, మార్క మొగిలి, సమ్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రాజకీయ అవగాహన లేకనే ఆరోపణలు

మల్హర్, మార్చి 29 : మల్హర్ మండల కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుపై కనీస రాజకీయ అవగాహన లేమితో మాట్లాడడం బాధాకరమని పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. 2007 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంథని ప్రజల కోసం కాంగ్రెస్‌ను, మీ నాయకుడిని విభేదించి పార్టీ నుంచి బయటికి వచ్చాడే తప్ప ఆస్తులు, అంతస్తుల కోసం పార్టీ మారలేదన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసినప్పుడు మీరు కూడా మద్దతు పలికారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నా లేకపోయినా మంథ ని ప్రజల కోసమే ఇక్కడే ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చకపోతే నియోజకవర్గ ప్రజలు నిలదీసే రోజులు వస్తాయని గుర్తు చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, నాయకులు తాజొద్దీన్, జాగరి హరీశ్, ఎంపీటీసీ రావుల కల్పన, మొగిలి, డైరెక్టర్లు రాజేశ్వర్‌రావు, మాచర్ల సురేశ్, సుంకు రాము, పొట్ల రాజమ్మ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న ఒకరిపై కేసు

చిట్యాల, మార్చి 29 : గుడుంబా తరలిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాశిగడ్డ తండాలో దాడులు నిర్వహించి గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నమ్మదగిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన లావుడియా వనక్క గ్రామ శివారులో గుడుంబా తయారు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. తయారీ ప్రదేశంలో 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 10 లీటర్ల గుడుంబా, నిందితురాలు వనక్కపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ చెప్పారు.

వసతులున్నా.. వైద్యులేరి?

- ప్రభుత్వ దవాఖానలో డాక్టర్ల కొరత
- 22 పోస్టులకు ఉన్నది ఏడుగురే..

ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాల

ఏటూరునాగారం, మార్చి 29 : మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. కాంట్రాక్టు పద్ధతిపై వచ్చిన కొందరు ఉన్నత చదువుల కోసం వెళ్తున్నారు. కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపూర్, మంగపేట, తాడ్వాయి మండలాలకు ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాల సేవలందిస్తున్నది. జిల్లాలో రెండో స్థానంలో ఉండే వైద్యశాలలో నిపుణులు లేకపోవడంతో అనుకున్న స్థాయిలో రోగులకు సేవలందడం లేదు. ఇక ప్రతిరోజూ సుమారు 150 వరకు ఓపీ ఉంటుంది. తీర ప్రాంతానికి చెందిన వారు ప్రసవాల కోసం ఇక్కడికే వస్తుంటారు. పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో ప్రస్తుతం ఉన్న వైద్యులపై భారం పడుతోంది. వైద్యశాల ఆవరణలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం విభాగంలో రెండు డాక్టర్ పోస్టులుండగా ఇక్కడ ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారు. నవజాత సంరక్షణ యూనిట్‌లో రెండు పోస్టులుండగా ఒక్కరే ఉన్నారు. సామాజిక వైద్య శాల విభాగంలో మొత్తం 22 డాక్టర్ పోస్టులుండగా ప్రస్తుతం ఏడుగురు వైద్యులు మాత్రమే పనిచేస్తున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 14 కాగా, ఇందులో నలుగురు కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తిస్తుండగా రెగ్యులర్ డాక్టర్ ఒకరు మాత్రమే ఉన్నారు. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ రెండు పోస్టులు, ఆర్ఎంవో పోస్టు ఖాళీగానే ఉన్నాయి. ఇదిలా ఉండగా వైద్యుల నుంచి మొదలుకుని స్వీపర్ వరకు 48 పోస్టుల్లో 21 పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. వీటిలో ఎక్కువ శాతం వైద్యుల పోస్టులున్నాయి. ఏటూరునాగారం కేంద్రంగా ఏజెన్సీలో సేవలందించాలనే లక్ష్యంతో సామాజిక వైద్యశాల ఆవరణలో రూ. 7 కోట్ల వ్యయంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. దీనికి తోడు ఇక్కడ బ్లడ్ బ్యాంకు కూడా ఉంది. రోగ నిర్ధారణ పరీక్షల కోసం టీ హబ్ పక్కా భవనం నిర్మించారు. వైద్యశాలలో మౌలిక వసతులున్నప్పటికీ వైద్యుల కొరత మాత్రం తీరడం లేదు. గైనకాలజిస్టు, అనస్థీషియా, రేడియాలాజిస్ట్ లాంటి పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించి వరంగల్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్ పోస్టును మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అనేక మంది ప్రసవాలకు ఇక్కడికే వస్తున్నారు. గతంలో ప్రతి నెలా 70కు పైగా ప్రసవాలు, సర్జరీలు జరిగేవి. రెండు నెలలుగా చూస్తే నెలకు 45 దాటడం లేదు. ఏజెన్సీకి ప్రధాన కేంద్రంగా ఉన్న ఏటూరునాగారం సామాజిక వైద్యశాలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక్కడ డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. స్థానికంగా దంత వైద్యులు ఉన్నప్పటికీ పరికరాలు లేకపోవడంతో వారు ఓపీకే పరిమితం కావాల్సి వస్తున్నది. అయితే ఏటూరునాగారానికి వచ్చి పనిచేసేందుకు డాక్టర్లు సుముఖంగా లేనట్లు తెలుస్తున్నది. టీ హబ్‌లో అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చలేదు. అత్యవసరంగా భావించే కొన్ని పోస్టుల్లోనైనా వైద్యులను నియమించి సేవలు పెంచాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే

మంగపేట : కమలాపురంలో ఏసుక్రీస్తు సిలువయాత్ర

భూపాలపల్లి రూరల్/ మంగపేట, మార్చి 29: భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ, కారల్‌మార్క్స్ కాలనీ, మంజూర్‌నగర్, ఎల్‌బీ నగర్, శాంతినగర్ కాలనీ, మంగపేట మండలం కమలాపురం రోమన్ కేథలిక్ చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ క్రైస్తియన్లు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పాస్టర్లు డేవిడ్‌రాజ్, సునిల్, అవినాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య మార్గాన్ని అలవర్చుకోవాలని, తల్లి దండ్రుల పట్ల బాధ్యతగా మెలగాలని అన్నారు. ధర్మాన్ని ఆచరించడం, సన్మార్గంలో నడవడం వంటి వాటిని పాటించి చూపి ఏసుప్రభు దేవుడయ్యాడని తెలిపారు. రోమన్ కేథలిక్ చర్చి నుంచి చేపట్టిన క్రీస్తు సిలువ యాత్ర ఆకట్టుకున్నది. సీనియర్ పాస్టర్లు కే ఆదాం, ఎస్ విజయరాజు, వీ దేవరాజు, టీ కృపానిధి, సత్తిబాబు, జానేశ్, శ్రీనివాసపాల్, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

జ్వరంతో ఒకరి మృతి

మహేశ్ (ఫైల్)

మంగపేట, మార్చి 29 : మండలంలోని చెరుపల్లి (కొత్త పేట)కు చెందిన పూజారి మహేశ్ (38) శుక్రవారం జ్వరంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మూడు రోజుల నుంచి మహేశ్‌కు జ్వరం వస్తున్నది. ఈ క్రమంలో స్థానికంగా వైద్యం చేయించినా తగ్గుముఖం పట్టకపోవడంతో రక్త పరీక్షలు చేయించగా డెంగీ, టైఫాయిడ్‌గా నిర్ధారణ అయింది. జ్వర తీవ్రత పెరగడంతో ఏటూరునాగారంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు ములుగు తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

కాటారంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

కాటారం, మార్చి 29 : మండలకేంద్రంలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి నేతృత్వంలో చింతకాని క్రాస్ నుంచి మండలకేంద్రంలోని పలు వీధులు, పోలీస్‌స్టేషన్ మీదుగా బలగాలు కవాతు నిర్వహించాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో మనోధైర్యం కల్పించడానికి కవాతు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించినా, అసాంఘిక కార్యకలాపాలు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాటారం, మహాదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రాజేశ్వర్‌రావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్, హరిశేఖర్, నరేశ్, మహేందర్, పోలీస్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ములుగు రూరల్, మార్చి 29 : గుండెపోటుతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన బండారి రమేశ్ జనవరిలో మృతి చెందగా ఆయన 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు రూ. 50 వేలు సేకరించారు. వీటిని రమేశ్ కుమార్తె పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన పాస్ బుక్‌ను శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో విజేందర్, గంగాధర్, భాస్కర్, పోషన్న, శివరాజు, రవి, లాల్, కృష్ణ, రాజమనోహర్‌రెడ్డి, సలీమ్, సదానందం, సతీశ్, భాస్కర్, కమలాకర్, కుమార్ పాల్గొన్నారు.

పాస్‌బుక్‌ను అందజేస్తున్న స్నేహితులు

జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు

కమలాపూర్, మార్చి 29 : మండలంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)క్రికెట్ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఆయా జట్ల గెలుపోటములపై యువకులు రూ. లక్షలు బెట్టింగ్ పెడుతున్నారు. కమలాపూర్, ఉప్పల్, భీంపల్లి, శనిగరం, మర్రిపల్లిగూడెం, గూడూరు, అంబాల తదితర గ్రామాల్లోని యువకులు రాత్రి 12 గంటల వరకు సెల్‌ఫోన్‌లోనే బెట్టింగ్‌లు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు చెల్లింపులు చేస్తున్నారు. కొందరు యువకులు రోజూ డబ్బులు పోగొట్టుకుంటున్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు దృష్టి సారించి, బ్రోకర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకు పోతున్న బొగ్గు నిల్వలు

- 300 టన్నుల వరకు ఉప్పల్ రైల్వే స్టేషన్ వరకు రవాణా చేస్తాం
- సింగరేణి సీఎండీ బలరాంనాయక్

జెండా ఊపి గూడ్స్ రైలును ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరాం నాయక్

భూపాలపల్లి రూరల్, మార్చి 29 : బొగ్గు వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గూడ్స్ షెడ్డును ప్రారంభించినట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మొదటి కోల్ రేక్, సౌత్ సెంట్రల్ రైల్వే సింగరేణి కో ప్రాజెక్ట్ వారి అనుసంధానంతో ఉప్పల్ గూడ్స్ షెడ్డును భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ అధ్యక్ష తన ప్రారంభించగా, సీఎండీతో పాటు ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ టీ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై గూడ్స్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ భూపాలపల్లి సింగరేణి ఏరియా నుంచి రోజుకు సుమారు 300 టన్నుల బొగ్గును ఉప్పల్ రైల్వే స్టేషన్‌కు రవాణా చేసి అక్కడి నుంచి వినియోగదారులకు రవాణా చేయనున్నామన్నారు. ఇందుకు సంబంధించి దక్షిణమధ్య రైల్వే అధికారులతో సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జే అల్విన్, జీఎం మార్కెటింగ్ సూర్యనారాయణ ఇటీవల ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో చర్చించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భూపాలపల్లి ఏరియాలో సుమారు 14 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుందని, అందుబాటులోకి వచ్చిన బొగ్గును విద్యుత్ వినియోగదారులకు పంపించేందుకు యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ టీ వెంకటేశ్వర్‌రెడ్డి భూపాలపల్లి కేటీకే ఓసీ-3, కేటీకే ఓసీ-2 గనులను సందర్శించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను, బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు అవసరమయ్యే యంత్రాలు, పని స్థలాలు, పరికరాలు, కావాల్సిన స్పేర్‌పార్ట్స్‌పై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ హబీబ్ హుస్సేన్, చైర్మన్ కో ప్రాజెక్ట్ విజేందర్‌రెడ్డి, సీసీఎస్‌ఆర్ వెంకటరమణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఏరియా అధికారి ముస్వర్ పాషా, ఉప్పల్ స్టేషన్ మాస్టర్ దిలీప్ కుమార్, ఏజీఎం జ్యోతి, డీవైపీఎం శ్యామ్ ప్రసాద్, ఇన్‌చార్జి అధికార ప్రతినిధి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

వెంకటాపూర్, మార్చి 29 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి ఉమేశ్, లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన ఎంబడి శృశాంత్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తరపున వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ప్రదీప్‌రావు, ఎంపీపీ బుర్ర రజితా సమ్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, జిల్లా నాయకుడు మల్క రమేశ్, కో ఆప్షన్ మెంబర్ జహీర్‌పాషా, నాయకులు కూరెళ్ల రామాచారి, చంటి భద్రయ్య, రాజయ్య, వీర స్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

లారీలు ఇలా.. దారి ఎలా?

- ఇసుక లారీలతో వాహనదారుల ఇబ్బందులు

అయ్యవారిపేట, ధర్మవరం ఇసుక ర్యాంపులకు వెళ్లే రహదారిలో కిక్కిరిసిన లారీలు

వాజేడు, మార్చి 29 : మండలంలోని చెరుకూరు నుంచి ధర్మవరం, అయ్యవారిపేట గ్రామాల మీదుగా పేరూరు వెళ్లే రహదారి ఇసుక లారీలతో కిక్కిరిసి పోతున్నది. అసలే ఇరుకు దారి.. నిత్యం పదుల సంఖ్యలో లారీలు ఒకదానివెంట మరొకటి వస్తుండడంతో ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా గంటల తరబడి ట్రాఫిక్‌జాం అవుతున్నది. అయ్యవారిపేట గోదావరి పరీవాహక ప్రాంతాల్లో మిర్చి సాగుచేసిన రైతులు సైతం అటుగా ఇసుక ర్యాంపుల నుంచి వచ్చిపోయే వాహనాలతో దుమ్ములేచి చేన్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఇసుక లారీ అయ్యవారిపేట గ్రామ శివారులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో పోల్ దెబ్బతిని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే మండపాక వద్ద సైతం రహదారికి ఇరువైపులా ఇసుక లారీలు నిలిపివేస్తుండడంతో ఏటూరునాగారం, వెంకటాపురం, వాజేడు వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకుడు

బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రవీణ్‌కుమార్

ములుగు రూరల్, మార్చి 29 : ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్వేరోస్ నాయకుడు బొట్ల కార్తీక్ శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కార్తీక్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ స్వేరోస్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఆర్ఎస్పీతో తన ప్రయాణం నడుస్తున్నదని, ఆయనతోనే తన భవిష్యత్ ప్రయాణం కొనసాగుతుందన్నారు. ములుగు జిల్లాలో పదవులతో సంబంధం లేకుండా బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని కార్తీక్ వివరించారు.

మోదీ నాయకత్వంలో దేశం భద్రం

భూపాలపల్లి రూరల్, మార్చి 29: మోదీ నాయకత్వంలోనే దేశం, మన పిల్లల భవిష్యత్తు భద్రంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి మంజూర్‌నగర్ ఏఎస్ఆర్ గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రమేశ్ హాజరయ్యారు. పేదల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని రమేశ్ అన్నారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

చేతి పంపును పరిశీలిస్తున్న వీరభద్రం

మహదేవపూర్, మార్చి 29 : గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఎల్‌పీవో వీరభద్రం జీపీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో ప్రసాద్‌తో కలిసి మండలంలోని బొమ్మాపూర్, బెగ్లూర్, సూరారం గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి కోసం వేసిన చేతి పంపులు, బోర్లు, వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు, బోర్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పనిచేయని వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, అంజలిరెడ్డి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

ములుగు రూరల్, మార్చి 29 : భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా ములుగు పట్టణానికి చెందిన రాయంచు నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పార్టీ అధ్యక్షుడు సిరికొండ బలరాం నాగరాజుకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న మోటర్ సైకిల్ యాత్రికుడు బీజూ

బాలికా విద్యపై మోటర్ సైకిల్ యాత్ర

మహదేవపూర్, మార్చి 29 : బాలికా విద్య సాధికారతపై బీజూ అనే వ్యక్తి చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర 89వ రోజు మహదేవపూర్ గ్రామానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా 800 రోజుల పాటు నిర్వహించే యాత్రలో భాగంగా ఆయన శుక్రవారం మండలకేంద్రానికి చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలికా విద్య సాధికారతపై అవగాహన కల్పించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు శాలువా కప్పి సన్మానించారు.

చేతి పంపుల మరమ్మతు

మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

గణపురం మార్చి 29 : గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి నివారణ కు చేతి పంపులు మరమ్మతు చేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అప్పయ్యపల్లి గ్రామ పంచాయతీ యూపీఎస్ స్కూల్ వద్ద చేతిపంపును రిపేరు చేయించినట్లు తెలిపారు. ఎంపీడీవో భాస్కర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో చేతిపంపులను మెకానిక్ గడ్డం భిక్షపతి ఆధ్వర్యంలో మరమ్మతులు చేస్తున్నట్లు శ్రీకాంత్ చెప్పారు.

మహిళకు నోటీసును అందజేస్తున్న అధికారులు

చీరలను సీజ్ చేసిన అధికారులు

ములుగు రూరల్, మార్చి 29 : ములుగు జిల్లా కేంద్రం పరిధిలోని గట్టమ్మ వద్ద గురువారం రాత్రి వాహనంలో తీసుకువస్తున్న చీరలను ఎన్నికల అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎగ్గడి సదయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గట్టమ్మ వద్ద వాహనాలను తనిఖీని చేపట్టాన్నారు. ఈ మేరకు హనుమకొండ వైపు నుంచి వస్తున్న మహేంద్ర జైలో వాహనంలో 10 బ్యాగుల్లో చీరలు లభించాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం అమరవరం గ్రామానికి చెందిన మొగిలిపల్లి సువర్ణకుమారి రూ.1,17,700 విలువైన 582 చీరలను తరలిస్తున్నట్లు గుర్తించామని, రూ.50వేల కంటే ఎక్కువ విలువైన నగదు లేదా వస్తువులను తరలించవద్దనే నిబంధనలున్నందున వాటిని సీజ్ చేసి కలెక్టరేట్‌లో భద్రపర్చినట్లు సదయ్య తెలిపారు.

నేడు వాహనాల వేలం

కాటారం, మార్చి 29 : కాటారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. వివిధ సంఘటనల్లో పట్టుబడిన 7 ద్విచక్ర వాహనాలకు జిల్లా ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి జరిగే వాహనాల వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, V.D.V. RAMCHANDER RAO (Old Name), R/o. 4-1-25, Kothur Street, Hanamkonda, Hanumakonda Dist.-506001, T.S, India. have Changed My Name from V.D.V. RAMCHANDER RAO to VODAPELLY RAM CHANDER RAO (New Name), S/o. VODAPELLY SURYANARAYANA in all my Records. NTW-00

WANTED

jobs Apply Now!

★HNK లగ్జరీ ఎంటర్ ప్రైజెస్ మెయిన్ స్తంభాల గుడి ప్రక్కన Air Coolor & ఫర్నిచర్ షాపులో పని చేయడానికి సెల్స్ గర్ల్స్, సెల్స్ బాయ్స్, సూపర్ వైజర్, హెల్పర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర:9347881523. NTW-321500

★BS ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో పనిచేయుటకు చురుకైన రిసెప్షనిస్ట్, బిజినెస్ డెవలపర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ (స్త్రీలు/పురుషులు) అర్జెంటుగా కావలెను. VRS వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వబడును. Cell: 7799777394 NTW-321499

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ఆదిత్య శ్రీ రియాల్టర్స్ & డెవలపర్స్

★మీకు సంబంధించిన ఖాళీ స్థలాలను గానీ, ఇళ్ళ స్థలాలను గానీ, వ్యవసాయ స్థలాలను గానీ మాకు డెవలప్‌మెంట్‌కి ఇవ్వండి మీరు ఆశించినంత పొందండి సంప్ర: 9394326111, 7981174745. NTW-00

HMDA & RERA PLOTS

★3-5 సంవత్సరాలలో Future City బీబీనగర్‌లో 200 ఎ।। AIIM